# బీఆర్ఎస్‌కు జై కొట్టిన గౌడన్నలు

- నాలుగు వందల మంది చేరిక
- బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతు



ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన గౌడ కులస్తులు

కమలాపూర్, అక్టోబర్ 31: ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలతో అంతటా బీఆర్ఎస్‌కు మద్దతు పెరుగుతున్నది. బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డికి నియోజకవర్గం జైకొడుతున్నది. మంగళవారం కమలాపూర్ మండలం మర్రిపెల్లి గూడెం గ్రామానికి చెందిన సుమారు 400 మంది గౌడ కులస్తులు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరగా, వారికి పాడి కౌశిక్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరంతా తమ మద్దతు కౌశిక్‌రెడ్డికే అంటూ ప్రకటించారు. భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పారు. అలాగే, గ్రామంలోని పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేరగా గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పులి నాగరాజు, సర్పంచ్ ఇనుగాల కిరణ్మయి-విజయ్, మాజీ సర్పంచులు ఎలిమి కుమారస్వామి, రమేశ్, గ్రామశాఖ అధ్యక్షుడు కదురు తిరుపతి, నాయకులు సత్యనారాయణరావు, ఇంద్రసేనారెడ్డి తదితరులున్నారు.

## రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

అరవై ఏండ్లలో జరగని అభివృద్ధిని సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లలో చేసి చూపించారు. గత ప్రభుత్వాలు గౌడ కులస్తులను పట్టించుకోలేదు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కేసీఆర్ గౌడ కులస్తుల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చాం. సీఎం కేసీఆర్ 5లక్షల బీమా సదుపాయం కల్పించారు. మద్యం షాపు టెండర్లలో రిజర్వేషన్ ఇచ్చారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందుకు బ్రహ్మాండమైన మ్యానిఫెస్టో తెచ్చారు. ఆయన మాట ఇస్తే తప్పడు. ఇది ప్రజలు గుర్తుంచుకోవాలి. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. హుజూరాబాద్‌లో తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా. హుజూరాబాద్ నియోజకవర్గంలో చేసే అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా కరపత్రం ముద్రించా. ఉప ఎన్నికలో గెలిచిన ఈటల రాజేందర్ ఎలాంటి అభివృద్ధి పనులకు నిధులు తేలేదు. ఇది ప్రజలు గమనించాలి. ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తున్న గులాబీ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలి.

**- పాడి కౌశిక్‌రెడ్డి, హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి**

## బొట్టుపెట్టి.. ఓటు అభ్యర్థించి

కొత్తపల్లి, అక్టోబర్ 31: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ తరపున కుటుంబ సభ్యులు ప్రచారం చేస్తున్నారు. మండలంలోని బద్దిపల్లి, కమాన్‌పూర్ గ్రామాల్లో మంత్రి గంగుల కమలాకర్ సతీమణి రజిత, కుటుంబ సభ్యులు గంగుల సుధాకర్, శారద ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి ఓటు అభ్యర్థించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మంత్రి చేపట్టిన అభివృద్ధి పనులను వివరించి, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి శ్రీలత-మహేశ్, సర్పంచ్ మధు, దివ్య, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



బద్దిపల్లిలో ప్రచారం చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్

# ఓర్వలేకనే కాంగ్రెస్ చిచ్చు

- బీఆర్ఎస్‌కు వస్తున్న ప్రజాదరణను తట్టుకోలేకపోతున్నది
- పచ్చటి తెలంగాణపై కుట్రలు చేస్తున్నది
- ప్రతిపక్షాలు సమాజాన్ని విషపూరితం చేస్తున్నాయి
- మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై దాడి అమానుషం
- చొప్పదండి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్

చొప్పదండి, అక్టోబర్ 31: తెలంగాణలో బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక, పచ్చటి తెలంగాణలో కాంగ్రెస్ చిచ్చు పెట్టాలని చూస్తున్నదని బీఆర్ఎస్ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ మండిపడ్డారు. దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి అమానుషమని ఖండించారు. చొప్పదండి పట్టణంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సుంకె రవిశంకర్ మాట్లాడారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, బీజేపీ నేతలు బండి సంజయ్, అర్వింద్, ఈటల రాజేందర్ మాటలు, చేతలు ఏ మాత్రం బాగాలేవని విమర్శించారు. ఈ విద్వేష ధోరణి సమాజాన్ని విషపూరితం చేస్తున్నదని, ప్రజల మనసులు కలుషితం అవుతున్నాయని వాపోయారు. ఇది తెలంగాణకు మంచిది కాదని కేసీఆర్ ఎప్పటి నుంచో చెబుతున్నారని తెలిపారు. పచ్చటి తెలంగాణలో నెత్తుటి రాజకీయం మొదలైందని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితవు పలికారు. తూటా పేలకుండా, కర్ఫ్యూ రాకుండా, రక్తపు చుక్క చిందకుండా తెలంగాణను సీఎం కేసీఆర్ కాపాడుతున్నారన్నారు. తెలంగాణ శాంతికి చిరునామాగా మారిందని చెప్పారు. కానీ, కాంగ్రెస్, బీజేపీ అధికారం కోసం చిచ్చు పెడుతున్నాయని విమర్శించారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓ అభ్యర్థిపై హత్యాయత్నం జరగడం బహుశా ఇదే మొదటిసారి అన్నారు. నాలుగు ఓట్ల కోసం కాంగ్రెస్, బీజేపీ నేతలు విచ్చలవిడిగా, అడ్డూ అదుపూ లేకుండా వాడుతున్న భాష తెలంగాణ భవిష్యత్‌కు మంచిది కాదని హితవు పలికారు. టికెట్ల అమ్మకాలతో పార్టీలో రచ్చ జరుగుతుండడం, నాయకులంతా పార్టీ నుంచి వెళ్లి పోతుండడంతో రేవంత్ రెడ్డి బ్యాచ్‌కు ఓటమి తప్పదని అర్థమైందన్నారు. నిస్పృహలో కాంగ్రెస్ నాయకులు నీచ రాజకీయాలకు ఒడిగడుతున్నారని, అవి మానుకోవాలని హితవు పలికారు. క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ దూసుకు పోతుండడంతో కేసీఆర్ హ్యాట్రిక్ విజయం ఖాయమని సర్వేలు ముక్తకంఠంతో చెబుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎంపీపీ చిలుక రవీందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, సింగిల్ విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, మాజీ ఎంపీపీలు గుర్రం భూమారెడ్డి, వొల్లాల కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, కౌన్సిలర్లు వడ్లూరి గంగరాజు, మాడూరి శ్రీనివాస్, కొత్తూరి మహేశ్, కొత్తూరి నరేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



ఎస్సారార్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి
- ఈవీఎంల గోదాం, ఎన్నికల సామగ్రి కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

కలెక్టరేట్, అక్టోబర్ 31: అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె చొప్పదండి, కరీంనగర్ రిటర్నింగ్ అధికారులు, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి నగరంలోని ఈవీఎంల గోదాంను సందర్శించారు. అనంతరం ఎస్సారార్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సామగ్రి, ర్యాండమైజేషన్ ప్రక్రియ, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్, ఓట్ల లెక్కింపులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని, వీటన్నింటినీ ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ల రిటర్నింగ్ అధికారులు సమీక్షించుకోవాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కోసం కళాశాలలోకి ప్రవేశం, బయటకు వెళ్లేదారి, పార్కింగ్‌లో సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇంకా ఇతర అవసరాలు కూడా గుర్తించి, అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్లు రమేశ్, రాజేశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బాలికలు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- బాలల పరిరక్షణ సమితి జిల్లా చైర్‌పర్సన్ ధనలక్ష్మి
- ఘనంగా ప్రపంచ బాలికా దినోత్సవం
- ఆకట్టుకున్న నృత్యాలు, కరాటే విన్యాసాలు

కలెక్టరేట్, అక్టోబర్ 31: బాలికలు తమ భవిష్యత్‌పై నిర్దిష్ట లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలని బాలల పరిరక్షణ సమితి జిల్లా చైర్‌పర్సన్ ధనలక్ష్మి సూచించారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రపంచ బాలికా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎన్ని అవరోధాలైనా అధిగమించేలా మానసికంగా సిద్ధం కావాలన్నారు. ప్రతి రంగంలో ముందంజలో ఉంటూ, సమాజంలో తమకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న మహిళలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. 21 ఏళ్లు నిండకుండా వివాహాలు చేసుకోకూడదని, తల్లిదండ్రుల నుంచి వివాహం కోసం ఒత్తిడి వస్తే మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. బాలికలు ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసి తమ బంగారు భవిష్యత్‌కు ఉజ్వల బాటలు వేసుకోవాలని ఉద్బోధించారు. అంతకుముందు పలువురు బాలికలు ప్రదర్శించిన నృత్యాలు, కరాటే విన్యాసాలు, పలు గేయాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ కేటగిరీల్లో ప్రతిభ చూపిన బాలికలకు మెమెంటోలు బహూకరించారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు కళింగ శేఖర్, రాధ, అర్చన, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, జీసీడీవో కృపారాణి, సీడీపీవోలు ఉమారాణి, సబితాకుమారి, కస్తూరి, డీసీపీవో శాంత, శ్రీలత, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సంపత్, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న బాలల పరిరక్షణ సమితి జిల్లా చైర్‌పర్సన్ ధనలక్ష్మి, అధికారులు

పత్రికా ప్రకటన

**హానరబుల్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, హన్మకొండ**

HMOP No. 233/2022

Between:

**ఒజ్జ రాజు అలియాస్ రాజ్‌కుమార్ యాదవ్**, వయస్సు 25 సం||లు, వృత్తి: కూలీ, తండ్రి: ఒజ్జ ఐలయ్య, గ్రామము: కనుకులగిద్ద, మం|| హుజురాబాద్, జిల్లా: కరీంనగర్, ప్రస్తుత నివాసం: ఇ.నెం. 6-678, వెల్లంపల్లి రోడ్, పరకాల, గ్రా|| మరియు మండలం, హన్మకొండ జిల్లా.

...పిటీషనర్/భర్త

మరియు

**ఒజ్జ అలియాస్ కొడారి ప్రవళిక**, వయస్సు 23 సం||లు, వృత్తి: గృహిణి, భర్త: ఒజ్జ రాజు అలియాస్ రాజ్‌కుమార్ యాదవ్, తండ్రి: కొడారి రాజయ్య, నివాసం: బొత్తలపల్లె గ్రామము, హుజురాబాద్ మండలం, కరీంనగర్ జిల్లా.

...రెస్పాండెంట్/భార్య

పిటీషనర్ ఒజ్జరాజు అలియాస్ రాజ్ కుమార్ యాదవ్ గౌరవ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, హన్మకొండలో HMOP No. 233/2022 విడాకుల కేసు దాఖలు చేశారు. రెస్పాండెంట్ అయిన మీరు కోర్టుకు హాజరుకావాల్సిందిగా కోర్టు వారు మీకు నోటీసు పంపించడం జరిగింది. నోటీసు ముట్టినప్పటికినీ మీరు కోర్టుకు హాజరు కాలేదు. కావునా, చివరి అవకాశంగా తేది: 24-11-2023 రోజున ఉదయం 10 గం||ల:30ని||లకు పైన తెలిపిన అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, హన్మకొండ గారి ముందు తమరు హాజరు కావాల్సిందిగా పత్రికా ముఖంగా తెలియజేయడమైనది.

తేది: 27-10-2023

సం/- **గోపు సమ్మిరెడ్డి**, పిటీషనర్ తరపు న్యాయవాది హన్మకొండ. సెల్: 8500402468.